క్లుప్తంగా

ప్రశ్నపత్రం ఆవిష్కరణ

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల ప్రశ్నపత్రాన్ని శుక్రవారం స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయురాలు సత్య సుజాత ఆవిష్కరించారు. జేవీవీ రాష్ట్ర కోశాధికారి బి.రాజశేఖర్ రాహుల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు దాదాపు ఐదు లక్షల మంది పిల్లలు హాజరవుతారన్నారు. మన జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ సైన్స్ సంబరాలు జరుగుతాయన్నారు.

17 నుంచి రాష్ట్ర సభలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 17, 18, 19, తేదీలలో నంద్యాలలో జరిగే ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బషీరున్నీషా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని భగత్‌సింగ్ నగర్‌లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు మున్ని, సరస్వతి, గౌసియా, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ సదస్సుకు కడప కవులకు ఆహ్వానం

కడప కల్చరల్ : ఈనెల 12వ తేదీన విజయవాడలో జరగనున్న జాతీయ ఉర్దూ సదస్సులో పాల్గొనాలని కడపకు చెందిన ఉర్దూ కవులకు ఆహ్వానం అందించినట్లు కవి సత్తార్‌ఫైజీ తెలిపారు. బజ్మే సుఖనే ఉర్దూ, రూటా అంజుమన్-యే-ఇస్లామియాల ఆధ్వర్యంలో జరగనున్న ఈ సభకు డాక్టర్ రాహి ఫిదాయి అధ్యక్షత వహిస్తారని, ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఉర్దూ సాహిత్యంపై కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ఇందులో మన జిల్లాకు చెందిన డాక్టర్ సత్తార్ సాహీర్, మహమూద్ షాహీద్, డాక్టర్ వసీవుల్లా బుక్తియార్, ఆచార్య ఖాసిం అలీఖాన్, హిదాయతుల్లా, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులను ఆహ్వానించారని తెలిపారు.

వైవీయూ జట్టు ప్రతిభ



తలపడుతున్న వైవీయూ జట్టు

వైవీయూ : కాకినాడ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో కడప యోగివేమన విశ్వవిద్యాలయం జట్టు చక్కటి ప్రతిభ కనబరిచింది. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో తమిళనాడుకు చెందిన అమిటీ యూనివర్సిటీ జట్టుపై వైవీయూ జట్టు 53–26 పాయింట్ల తేడాతో విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరింది. ఈ సందర్భంగా వైవీయూ జట్టుకు వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య అభినందనలు తెలిపారు.

12న ఉచిత వైద్య శిబిరం

కడప కల్చరల్: గుర్రాలగడ్డలోని అల్ హబీబా విద్యా సంస్థల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నామని కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, కోశాధికారి దేవతి రవీంద్రనాథ్ తెలిపారు. దేవ వైద్యుడు ధన్వంతరి జయంతి, ప్రపంచ ఆరోగ్య దినోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బుక్‌లెట్ విడుదల



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీజేపీ అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో మహా ధర్నాకు సంబంధించిన బుక్ లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో బీజేపీ ఘోరంగా విఫలమైందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యం.వి సుబ్బారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు ఎస్. శివశంకర్ రెడ్డి, బాల చంద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి, కొండయ్య, గురయ్యా, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘన సత్కారం

కడప ఎడ్యుకేషన్: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కడప నగరంలోని మౌలానా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్, సెక్రటరీ షేక్ మస్తాన్‌వల్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే షేక్ అబ్దుల్ షబ్బీర్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విద్యాసంస్కరణలకు ఆద్యుడు ఆజాద్

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



వైవీయూలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, అధ్యాపకులు

వైవీయూ: స్వతంత్ర భారత తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశంలో ఉన్నత విద్యారంగానికి నిరుపమాన సేవలు అందించారని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ కొనియాడారు. శుక్రవారం వైవీయూలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యాదినోత్సవం ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ, అధ్యాపకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు ఆజాద్ ఎనలేని కృషి చేశారన్నారు. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాసంస్కరణలకు నాంది పలికిందన్నారు.

– నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ వర్చువల్ విధానంలో మాట్లాడుతూ బ్రిటీష్‌కాలం నుంచి నేటి కాలం వరకు విద్యలో జరిగిన మార్పులు, విద్యార్థుల ప్రవర్తన గురించి వివరించారు. విద్య అనేది దేశ భవిష్యత్తును నిర్మించేదన్నారు.

– మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ మహమ్మద్ సిద్ధికి మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం ద్వారా సుస్థిర అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆలోచనలు ప్రపంచస్థాయిలో ఉండాలన్నారు.

– వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కలాం భావించారన్నారు. వైవీయూ ఆచార్యులు డా. పి.ఎస్. షావల్లీఖాన్, మైనార్టీ సెల్ సమన్వయకర్త డా. రియాజున్నీసాలు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాల రూపకల్పనలో మౌలానా ఆజాద్ కృషిని కొనియాడారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు.

– ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆజాద్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు.

పుస్తకాలు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ఆమీన్‌పీర్ రోడ్డులోని నగరపాలక ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతి వారోత్సవాల సందర్భంగా జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ, షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు పటాన్ ఖాదర్‌బాష విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు, హిందీ కాపీ రైటింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్ హాజరయ్యారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఇలియాస్‌బాష, హెచ్‌ఎం అహ్మద్‌బాష పాల్గొన్నారు.



పుస్తకాలను అందచేస్తున్న ఎంఈఓ-2

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు యల్లారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : భవన నిర్మాణరంగ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కడప నగర భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యల్లారెడ్డి, రాజేంద్రలు తెలిపారు. శుక్రవారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరోనా కాలం నుంచి భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అలాగే ప్రత్యేకమైన ఇన్స్‌రా సదుపాయాలు కల్పించడంతోపాటు వారి పిల్లలకు ఉచిత విద్యను అందించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కడప నగర అధ్యక్షులుగా యల్లారెడ్డి, జనరల్ సెక్రటరీగా రాజేంద్ర, గౌరవాధ్యక్షులుగా రామలింగారెడ్డి, కోశాధికారిగా చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కొండారెడ్డిలను ఎన్నుకున్నారు.

టిప్పు సుల్తాన్‌కు ఘన నివాళి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: టిప్పు సుల్తాన్ సేవలు మరువలేనివని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో హజరత్ టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు హాజీ సిరాజ్ బుఖారి, హాజీ రఫీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెను కచ్చితంగా అమలు చేయాలని కడప ఎంఈఓ-2 ఇర్షాద్ ఆహ్మద్ అన్నారు. శుక్రవారం కడప ఫస్ట్‌వార్డు గాంధీనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్గో కార్యాలయంలో మాసోత్సవాల సందర్భంగా లక్కీ డిప్ స్కీమ్‌లో విజేతలైన శర్మ, జయంత్, ఫజుల్లాకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం కమర్షియల్ జనార్దన్, సీఐ కన్యాకుమారి, ఆర్ఎంఈ చంద్ర, డీఎంఈ కేజీపీ రెడ్డి, బాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఏడురోడ్లు, నాగరాజుపేట సచివాలయ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను వారు సందర్శించి ప్రజలకు సూచనలు చేశారు. అన్నింటి కంటే ఆరోగ్యం ప్రధానం అన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరోగ్య విద్యాధికారిణి ఆర్.ప్రసన్నలత, శిక్షణ వైద్యులు, హోమియో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: కడప శాంతినగర్ యూపీ స్కూల్‌లో ఉమ్మడి కడపజిల్లా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, బలపాలు, మెండర్‌లతోపాటు స్వీట్లను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు లక్ష్మినారాయణ, జనరల్ సెక్రటరీ బివి గోపాల్‌రెడ్డి, కేఎస్ సుధాకర్‌రెడ్డి, కెప్టెన్ జానకీరామ్‌లు మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు విద్యాసామాగ్రితోపాటు సీట్లను పంపిణీ చేశామన్నారు.

ప్రణాళికతో విజయతీరాలు

వైవీయూ : భవిష్యత్తు కార్యాచరణ నిర్మించుకోవడం, అమలు చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం వైవీయూలో 'స్ఫూర్తిదాయకమైన భవిష్యత్తును పొందడం ఎలా' అన్న అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ప్రధాన వక్త సి.వి. మోహన్‌కుమార్ మాట్లాడుతూ స్ఫూర్తిదాయక భవిష్యత్తు నిర్మాణానికి విద్యార్థి దశ నుంచే కృషిజరగాలన్నారు. బహిరంగ సభలు, సమావేశాలలో ఉపన్యాసాలు, పరస్పర సహకారం, బృందకృషి, చర్చలు వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎనెస్ఎస్ పీఓలు డా. బి. గంగయ్య, డా. సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

అఫ్జల్‌ఖాన్ సేవలు మరువలేనివి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ సమాజానికి అందిస్తున్న సేవలు మరువలేనివని ఖూన్ కా రిష్తా సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ తారిఖ్ అలీ అన్నారు. శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో బ్లడ్ వారియర్ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ నాయకుల్లో ఉత్తమ సేవలందించిన వారిని ఘనంగా సన్మానించారు. అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో ఎన్నో రక్తదాన శిబిరాలు నిర్వహించి, ఎంతో మంది రోగులకు రక్తాన్ని అందించినందుకు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు సలావుద్దీన్, మతగురువులు మౌలీ సాబ్, వైద్యులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్

– ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని.. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక 46వ డివిజన్‌లోని శాస్త్రి నగర్‌లో × ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే । కార్యక్రమంలో భాగంగా వార్డు సచివాలయ పరిధిలో వారు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఒక వర్గానికి మాత్రమే మేలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, 46వ డివిజన్ కార్పొరేటర్ ఎంవీ శ్రీదేవి, జేసీఎస్ జోన్ ఇన్‌చార్జి రెడ్డి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ నాగమల్లారెడ్డి, నారాయణమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

1వ డివిజన్‌లోని పాతకడపలో శుక్రవారం సాయంత్రం ×వై ఏపీ నీడ్స్ జగన్₹ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1/1 సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి జగన్ మళ్లీ సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జోన్ ఇన్‌చార్జి షఫీ, 1వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. చెన్నయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి హరూన్ బాబు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

బస్టాండు కిటకిట



దీపావళి పర్వదినంతోపాటు వరుస సెలవులు రావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో కడప ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది. శనివారం నుంచి మూడు రోజులపాటు విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి బస్టాండు ఆవరణంతా ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు రాగానే ప్రజలు సీట్ల కోసం పరుగులు తీశారు. ప్రయాణికుల రద్దీ మేరకు ఆర్టీసీ అధికారులు వివిధ రూట్లలో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. - కడప కోటిరెడ్డిసర్కిల్

మహాసభకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : హైదరాబాదులో ఈనెల 11వ తేదీ జరగనున్న మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభకు శుక్రవారం కడప రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలు బయలుదేరింది. ఫుట్ టారిఫ్ రేట్ పేరిట ఈ ప్రత్యేక రైలును ఎమ్మార్పీఎస్ నాయకులు రిజర్వు చేసుకున్నారు. ఈ రైలు కడప నుంచి పలు సెంటర్ల మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లనుంది. ఈ రైలు టిక్కెట్ చెకింగ్ స్టాఫ్‌ను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్లు ఉమర్‌బాష, నరసింహారెడ్డి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పర్యవేక్షణలో ఈ రైలు బయలుదేరి వెళ్లింది.


సీఎంకు, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న చింతకొమ్మదిన్నె మైనార్టీ నాయకులు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డికి రుణపడి ఉంటామని చింతకొమ్మదిన్నె వైఎస్సార్‌సీపీ మండల ప్రచార కమిటీ చైర్మన్ ఎస్. మోహిద్దీన్ బాషా, మైనార్టీ కన్వీనర్ హజరత్ అలీ, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్ తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఆజాద్ నగర్‌లో షాదీఖానా, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని 25 ఏళ్లుగా కోరుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్నపాపాన పోలేదన్నారు. శ్మశాన వాటిక లేక ఎవరైనా చనిపోతే కడప నగరానికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తమ సమస్యలపై స్పందించి షాదీఖానా, శ్మశాన వాటిక కోసం స్థలం ఏర్పాటు చేసి, వాటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారన్నారు. ఇందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ సిరాజ్, షేక్ మహబూబ్ బాషా, జునైద్ అలీమ్‌ఖాన్, మున్నాబాయ్, సయ్యద్ షామీర్, షావలి, రఫీ, సద్దాం, అమీన్‌పీర్, సర్దార్ పాల్గొన్నారు.

డీఎస్ఏ క్రీడాకారులకు అభినందన



అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్ఏ చీఫ్ కోచ్, కోచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటడం పట్ల డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ అభినందించారు. ఏపీ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌లో అండర్–17 విభాగంలో స్టేట్ చాంపియన్‌లుగా నిలిచిన జిల్లా జట్టులో డీఎస్ఏ క్రీడాకారులు గీతేశ్వర్, ఇర్ఫాన్, జగత్, బాలికల విభాగంలో హారిక, హరి, ప్రియ, సఫీజా ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా పూణేలో నిర్వహించిన జాతీయస్థాయి 52వ కేంద్రీయ విద్యాలయ క్రీడాపోటీల్లో అండర్–17 విభాగంలో క్రీడాకారిణి కె.వి. రేవతిదేవి ట్రిపుల్ జంప్‌లో రెండోస్థానం సాధించింది. లక్నోలో నిర్వహించిన బాలుర విభాగంలో అండర్–17 విభాగంలో సాయిప్రశాంత్ 1500 మీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం పొందాడు. ఈ సందర్భంగా డీఎస్ఏ చీఫ్ కోచ్ క్రీడాకారులను అభినందించారు. శిక్షణ అందించిన హాకీ కోచ్ కల్యాణ్‌ను, అథ్లెటిక్స్ కోచ్ అనిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.